# క్యారెట్

క్యారెట్ ముఖ్యమైన వేరుకూరగాయల్లో ఒకటి. దీనిలో విటమిన్ "ఎ" ఎక్కువగాను మరియు ఇతర ప్రధాన ఖనిజాలు ఉన్నాయి.

**వాతావరణం:** క్యారెట్ చల్లని వాతావరణంలో పండించే దుంప జాతి పంట. అధిక ఉష్ణోగ్రతలో దుంప పెరుగుదల, రంగు సరిగా వుండదు. అతి తక్కువ ఉష్ణోగ్రత వద్ద దుంపలు రంగు తక్కువగా, పొడవుగా ఏర్పడతాయి. నాణ్యమైన దుంపల దిగుబడికి $18-24^0$ సెం. ఉష్ణోగ్రత వుండాలి.

**నేలలు:** మురుగునీటి వసతి గల లోతైన సారవంతమైన గరప నేలలు అత్యంత అనుకూలం. బరువైన బంక నేలలు పనికిరావు. బంక నేలల్లో వేర్ల పెరుగుదల మందగించి దుంపలు అభివృద్ధి చెందవు. పక్క వేర్లు ఏర్పడతాయి. నేల ఉదజని సూచిక 6.5 ఉంటే మంచిది.

**రకాలు**

**పూసా కేసర్ (లోకల్‌రెడ్ × నాన్‌టెస్):** ఆకులు లోకల్ రెడ్ కన్నా చిన్నవిగా ఉండి, దుంప ఎర్రగా ఉంటుంది. లోపలి కండ భాగం కూడ ఎర్రగా ఉంటుంది. దీనిలో కెరోటిన్ శాతం ఎక్కువ. ఇందులో వేరు దుంపలను పొలంలో తయారయిన నెలరోజుల వరకు పుష్పించకుండా వుంచవచ్చు.

**ఎర్లీనాన్‌టెస్:** దుంపవేర్లు స్థూపాకారంలో ఉండి 12-15 సెం.మీ. పొడవు కలిగి, కాషాయరంగు కండ కలిగి ఉంటాయి. దుంప 90-100 రోజులలో తయారవుతుంది.

**చాన్‌టెనీ:** క్యానింగ్‌కు, నిల్వ చేయడానికి అనుకూలమైన రకం. వేరు దుంప 11.5 నుండి 15 సెం.మీ. పొడవు, 3-5 సెం.మీ. మందంతో ఉంటాయి. వేరు దుంప నారింజరంగులో నిగనిగలాడుతూ ఉంటుంది.

**పూసా యమదగ్ని (ఇ.సి. 9981 × నాన్‌టెస్):** ఇ.సి. 9981లో నుండి త్వరగా కాపుకొచ్చే లక్షణం మరియు నాన్‌టెస్ నుంచి బెండు, కండ ఒకే రంగు కలిగిన లక్షణాన్ని ఇది ఇనుమడించుకుంది. దుంప వేర్లు 15-16 సెం.మీ. పొడవు కలిగి, నారింజరంగుతో నిగనిగలాడుతూ ఉంటాయి. ఎక్కువగ దిగుబడినిస్తాయి. కెరోటిన్ కూడా ఎక్కువగా ఉంటుంది. నాన్‌టెస్ కన్నా 10 రోజులు ముందుగా కాపుకొస్తుంది. ఇవేకాక ఖరుడ, న్యూ ఖరుడ అనే హైబ్రిడ్ రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

**నాటే సమయం:** ఆగష్టు నుండి నవంబరు నెల వరకు నాటుకోవచ్చు. ప్రతి 15 రోజుల తేడాతో గింజలు విత్తుకుంటే, మార్కెట్ డిమాండ్ కనుగుణంగా దిగుబడి పొందవచ్చు.

**నాటేపద్ధతి:** 30×5 సెం.మీ.ల దూరంలో విత్తనాలు విత్తుకోవాలి.

**విత్తన మోతాదు:** ఎకరాకు 2 కిలోల విత్తనం అవసరం.

**ఎరువులు:** ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. 20:16:20 కిలోలు/ఎకరాకు చొప్పున నత్రజని, భాస్వరం, పొటాష్‌లను ఆఖరి దుక్కిలో వేయాలి. నత్రజనిని రెండు దఫాలుగా మొదటి సగం ఆఖరి దుక్కిలో, రెండవ భాగం విత్తిన ఆరు వారాల తర్వాత వేయాలి.

**కలుపు నివారణ, అంతరకృషి:** కలుపు మొక్కలు ఎప్పటికప్పుడు తీసివేయాలి. కలుపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.25 లీ. లేదా అలాక్లోర్ 1.0 లీ. (తేలిక నేలలు), 1.25 లీ. (బరువు నేలలు) చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 24 గంటల తరువాత 48 గంటలలోపు భూమిపై పిచికారి చేయాలి.

మెట్రిబుజిన్ మందును 300 గ్రా. విత్తిన 15 రోజులకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం:** వాతావరణ పరిస్థితులను బట్టి 7-10 రోజుల వ్యవధిలో నీటిని ఇవ్వాలి.

**సస్యరక్షణ:**

**పురుగులు:**

**ఆకుతినే పురుగులు:** గొంగలి పురుగులు ఆకులను కొరికి తింటాయి. ఆకులపై చిన్న చిన్న రంధ్రాలు కన్పిస్తాయి.

**క్యారెట్ రస్ట్ ఫ్లై:** పిల్లదశ పురుగులు వేర్లలోకి చొచ్చుకొనిపోయి వేర్లను తినివేస్తుంది. దీనివల్ల వేర్లు ఆకారాన్ని కోల్పోయి, లోపల కుళ్ళిపోయి మార్కెట్‌కు పనికిరాకుండా పోతాయి. ఆకులు వాడి రాలిపోతాయి. నివారణకు మలాథియాన్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**తెగుళ్ళు:**

**ఆకుమచ్చ తెగులు:** ఆకులపై ముదురు గోధుమ రంగు మచ్చలు ఏర్పడి క్రమేపి పండిపోయి వాడిపోతాయి.

**మాడు తెగులు:** ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేపి కలిసిపోయి, పండిపోయి వాడిపోతాయి.

**బూడిద తెగులు:** ఆకుల అడుగున మరియు పై భాగాన బూడిద వంటి పదార్థం ఏర్పడి క్రమేపి ఆకులు పండిపోయి ఎండిపోతాయి.

క్యారెట్‌పై ఆశించే పురుగులు మరియు తెగుళ్ళ నివారణకు (ఆకుమచ్చతెగులు, మాడుతెగులు, బూడిద తెగులు మరియు ఆకుతినే పురుగులు) మలాథియాన్ 2 మి.లీ. + వెట్టబుల్ సల్ఫర్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి విత్తిన 4, 7, 10 వారాల తర్వాత పిచికారి చేయాలి లేదా హెక్సాకోనాజోల్ 2.0 మి.లీ మరియు డైమిథోయేట్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కోత మరియు దిగుబడి:** విత్తిన 90 రోజులకు పంట కోతకు సిద్ధంగా వుంటుంది. వెంటనే త్రవ్వి తీసుకోవాలి. ఆలస్యం అయితే పీచు శాతం ఎక్కువయి నాణ్యత తగ్గిపోతుంది. ఎకరాకు 8 టన్నుల దుంపల దిగుబడి వస్తుంది.

**నిలువ:** క్యారెట్ దుంపలు సాధారణ వాతావరణ పరిస్థితుల వద్ద 3-4 రోజులు తాజాగా వుంటాయి. కాని 0-4.4$^0$ సెం. ఉష్ణోగ్రత, 9% గాలిలో తేమ వద్ద గిడ్డంగులలో నిల్వచేస్తే 3-4 నెలలు చెడిపోకుండా వుంటాయి.


క్యారెట్ సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా

**సైంటిస్ట్ (హార్టికల్చర్) మరియు హెడ్, ఉద్యాన పరిశోధనా స్థానం,**

అదిలాబాద్ 504001. ఫోన్: 08732-220458.